వందేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం - 21**

వందేళ్ళ తెలుగు కథకు



# ఆ రోజుల్లో కలాన్ని ఆయుధం అనుకునేవారు


**- చంద్ర**

చంద్రంటే బొమ్మలు. చంద్రంటే కవితలు. చంద్రంటే కథలు, కబుర్లు. వెన్నెల వేడిగా ఉంటుందో ఉండదో తెలీదుగాని చంద్ర బొమ్మలు అప్పుడప్పుడూ వేడిగా ఉంటాయి. తరచూ కంటతడి పెట్టిస్తాయి. కొండంత భావాన్ని కుంచెలో కొంచెంగా చూపించడం చంద్రకే చెల్లింది. అలాగే గొంతులో గుండెను పలికించడం కూడా చంద్రకే తెలుసు! ఇటీవలి తెలుగు సాహితీ ప్రక్రియలకు, ఉద్యమాలకు నిలువెత్తు సాక్ష్యం చంద్ర. ఆ సాక్ష్యంతో ముఖాముఖీ మీ కోసం...

నవ్య వీక్లీ ఎడిటర్ జగన్నాథశర్మగారు నేను బాగ్‌లింగంపల్లిలో ఉంటున్న చంద్రగారి చిరునామా వెతుక్కుంటూ వెళ్లాం. మేం వెళ్ళేప్పటికి అంబేద్కర్ కళాశాల ఎదురుగా బస్టాపు దగ్గర మాకోసం ఆయన ఎదురు చూస్తున్నారు. ముగ్గురం కలసి చంద్రగారింటికి వెళ్లాం. వెళ్లగానే మంచి టీ ఇచ్చారు. కాసేపాగాక 'సుధ' హోటల్‌నుంచి రుచికరమైన దోసెలు తెప్పించారు. మధ్యమధ్యలో సిగరెట్టు తాగుతూ తన జ్ఞాపకాల పొగను వలయాలు వలయాలుగా వదలడం మొదలు పెట్టారు.

### బాల్యం అందరికీ అందంగా ఉంటుంది

ప్రతి వ్యక్తికీ బాల్యం అందంగా ఆనందంగా ఉంటుంది. స్థాయీ భేదాలే తప్ప చిన్నతనం అందరికీ ఒక్కటే. ఎదుగుతున్న కొద్దీ అనుబంధాలు, అనుభవాలతో కంపేరిజన్ మొదలు పెడతాం. మా అమ్మానాన్నలు సోమలక్ష్మి, రంగయ్య. అక్క, అన్న, నేను పిల్లలం. మాది వరంగల్. అక్కడ టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన అజాంజాహి మిల్ ఉంది. అందులో నాన్న క్లరికల్ సైడ్ పని చేసేవాడు. అందరికీ ఉన్నట్టే నాకూ మావలూ, అత్తలు, అమ్మమ్మలు ఉన్నారు. వారు రాజకుమారుల కథలు చెప్పేవారు. కొండ్రీసుగాడి కథ చెప్పేవారు.



ప్రముఖ చిత్రకారుడు ఎస్వీరామారావుతో...

అందులో కుక్కో, తోడేలో ఉంటుంది. అది మనిషిలాగా ప్రవర్తిస్తుంది. మా సముద్రాలత్త కథలు చాలా బాగా చెప్పేది. ఆమె ఊహించి చెప్పేదా, జరిగింది చెప్పేదా అనే విషయం తెలీదు గానీ, చాలా ఇంటరెస్టింగ్‌గా కథలు చెప్పేది. ఆమె చెప్పే ఒక కథలో దెయ్యం ఉండేది. నిటారుగా కూర్చుని కథను వినేవాణ్ణి. కథ అయిపోయేప్పటికి భయంతో వంగిపోయేవాణ్ణి.

### పావలా పావలా కలిపి చందమామ కొనేవాళ్లం

1954 ప్రాంతంలో అనుకుంటాను, మేము వరంగల్‌లోని మిల్లు కాలనీలో ఉండేవాళ్లం. ప్రతి నెలా వెచ్చాలు కొనడానికి అన్నయ్యా, నేను కలిసి నాన్నగారి తోపాటు వెళ్లేవాళ్ళం. వెచ్చాలు కొన్నాక నాన్నగారు మాకు చెరొక పావలా ఇచ్చేవారు. మేం ఇద్దరం స్టేషన్‌కు పోయి ఆ రెండు పావలాలు కలిపి అర్ధరూపాయి పెట్టి 'చందమామ' పుస్తకం కొనుక్కునే వాళ్లం. అలా చందమామతో కథలు చదవడం మొదలయింది.

### 'జనవ'రి అని ఏడిపించే వాడిని

మా బాల్యంలో అక్షరాలు రాసేవాళ్లంతా ఆంధ్రావాళ్లే. పండితులు కూడా ఆంధ్రావాళ్లే. అంటే వరంగల్‌లో ఉండే పండితులు అందరూ దాదాపు రాజమండ్రి ప్రాంతం వారు. వాళ్ల దగ్గరనుంచి అత్తరు వాసన వచ్చేది. అలాంటి కుటుంబంలో 'వనజ' అనే పిల్ల మా క్లాస్‌మేట్. అప్పుడు నేను రెండో తరగతి. ఆ పిల్లను 'జనవ'రి అని ఏడిపించేవాడిని.

### ఐదో తరగతి తర్వాత హైదరాబాదే

వరంగల్‌లో ఐదో తరగతి అయిపోయింది. ఆరో తరగతికి హైదరాబాద్ వచ్చాం. నేలమాళిగలాంటి ఇంట్లో అద్దెకు ఉండేవాళ్ళం. మేముండే కాంప్లెక్సులో మొత్తం ఎనిమిది ఇళ్లుండేవి. వట్టికోట ఆళ్వారుస్వామి, తర్వాత మేము, బి.ఎన్.శాస్త్రి, చక్రవర్తి రంగస్వామి, దాశరథి, బిరుదురాజు రామరాజుగారు, మరో రెండు మహారాష్ట్ర కుటుంబాలు ఉండేవి. అంతమంది ఉద్దండుల మధ్య ఉంటే నా పరిస్థితి ఎలా ఉంటుందో మీరే ఊహించుకోండి.

### రాజుగాడి రాజా పెన్ను!

దాశరథి, ఆళ్వారుస్వామి ఇళ్ళకు తరచూ వరంగల్ నుంచి, కరీంనగర్ నుంచి పండితులంతా వచ్చేవారు. ఆరుద్ర, అక్కినేని లాంటివారు కూడా వచ్చేవారు. రాసేవాళ్లంతా ఆంధ్రావాళ్ళేనా? నేను కూడా రాయచ్చు కదా అనుకున్నాను. నేను ఏడో క్లాసులో ఉండగా మొదటి కథ 'రాజుగాడి రాజాపెన్ను' రాశాను. మా చిన్నప్పుడు 'రాజా' పెన్నులుండేవి. సూర్యుడి వెలుతురుకు 'రాజా' అనే అక్షరాలు తళుక్కున మెరిసేవి. తరువాత 150కి పైగా కథలు రాశాను.

### గాలిబ్‌లా ఫీలయ్యేవాడిని!

ఆ రోజుల్లో 'కామినీ రెడ్డి' అని ఒకమ్మాయి ఉండేది. వాళ్ల నాన్న బాన్సువాడ దగ్గర మూడుసార్లు ఎంపీ అట. కామినీరెడ్డి జానపద సినిమాల హీరోయిన్ 'రాజశ్రీ'లాగా ఉండేది. రోజూ ఆ అమ్మాయి వెంట పడేవాడిని. మాట్లాడించేవాడిని. పలకరించి ఒక పద్యం రాసేవాడిని. ఆ పద్యాన్ని రోజూ నాతోటి పిల్లలకు వినిపించి 'గాలిబ్'లా ఫీలయ్యేవాడిని.

### మాయలో ముంచేసింది

యిది కూడా నా చిన్నప్పటి మాటే! ఒకసారి వై.ఎం.సి. హాల్లో ఒకామె మామిడిపూడి వెంకయ్యగారి పాట పాడుతోంది. ఆ మహాతల్లి అద్భుతమైన సుందరి. ఆమె పాట పాడుతోంటే స్వర్గంలోకి వెళ్లిపోయాను. మాయలో ఉన్నవాడిలా స్టేజిపైకి వెళ్లిపోయి ఆ అమ్మాయికి నమస్కారం పెట్టాను. నాపేరు చంద్ర అని పరిచయం చేసుకుని ఫ్రెండ్షిప్ చేస్తారా? అని అడిగాను. 'ఫ్రెండ్షిప్ అంటే' అందా అమ్మాయి. కన్పించినప్పుడు మాట్లాడుకోవడం అన్నాను. తన అడ్రస్ అడిగితే సరిగా ఇవ్వలేదు. ఎక్కడ ఉన్నది చెప్పిందంతే. ఒకరోజు అడ్రస్ వెతుక్కుంటూ వాళ్ళింటికి వెళ్ళాను. వాళ్ళ నాన్న ఉన్నాడు. ఆయన మహా కోపిష్టి. వాళ్ళమ్మాయి కోసం వచ్చానని చెప్పాను. నిక్కరుతో ఉన్న నన్ను ఎగాదిగా చూశాడు. 'ఎందుకొచ్చావు' అన్నాడు. 'మీ అమ్మాయి పాటంటే ఇష్టం' అన్నాను. 'ఎందుకిష్టం' అన్నాడు. 'మీ ఇంటి దగ్గరున్న మల్లెపూలు, నందివర్ధనం, గులాబీలు మీకు ఎందుకిష్టం' అని ప్రశ్నించి తిరిగి వచ్చేశాను. వాళ్ళింటికి రమ్మని తర్వాత ఆ అమ్మాయి ఉత్తరం రాసింది. నేను కథలు రాయటానికి, బొమ్మలు గీయటానికి ఆ అమ్మాయి ఎంకరేజ్ చేసింది. శిష్టా శకుంతల ఆ అమ్మాయి ఫ్రెండ్, శీలా వీర్రాజు గారి శిష్యురాలు. మేం తరచూ ఉత్తరాలు రాసుకునే వాళ్లం. చలం ఉత్తరాలుంటాయి గదా, అలాంటి ఉత్తరాలు ఆ అమ్మాయివి. ఎ.జి.ఆఫీసులో పనిచేసే కృష్ణాజీతో తనకు పెళ్ళయింది. ఎర్లీడేస్‌లో మనకు ఇన్‌స్పిరేషన్ ఇచ్చినవి మంచి వయితే, అవి మనల్ని ఎప్పటికీ వదలవు.

### రాసి బతికేది నువ్వురా! నేను కాదు!

దాశరథి మేము పక్క పక్క ఇళ్లలో ఉండేవాళ్లం అన్నాను కదా. నేను 1961లో టెన్త్ చదువుతున్న రోజుల్లో 'మజిలీ' అని కథ రాసి ఆంధ్రప్రభకు పంపాను. దాన్ని అచ్చుకు స్వీకరించినట్టు వాళ్ళ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

పధ్నాలుగు ఏళ్ళ కుర్రాన్ని, ఆంధ్రప్రభలో కథేంటి!? నాకు చాలా ఆశ్చర్యంతోపాటు ఆనందమేసింది. దాశరథి మద్రాసుకు పోయి వచ్చాడు. మాకందరికీ కామన్ బాత్‌రూంలు. ఆయన బాత్‌రూం దగ్గరున్నాడు. బ్రష్ చేసుకుంటూ వెళ్లాను. నన్ను చూడగానే ఆయన కోపంగా 'ఏంరా చందర్. ప్రభకు ఏమని రాసినవ్' అన్నాడు. 'కథ రాసిన' అన్నాను. 'అడ్రస్ ఏమని రాసినవ్. కేరాఫ్ దాశరధి అని రాసిండ్లే' అన్నాడు. మా ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. కేరాఫ్ అని తన పేరు రాసినందుకు ఆయనకు కోపం వచ్చింది. నా కథను వేయద్దని వాళ్ళకు చెప్పాడట! నాకు ఉక్రోషం వచ్చింది.

'రాసి బతికేది నువ్వురా, నేను డాక్టర్నవుతా..నీ మాదిరిగా రాసి బతకను' అని తిట్టాను.

దాశరథికి కోపం ఇంకా పెరిగింది. కొట్టడానికి నా వెంటపడ్డాడు. నేను పరిగెత్తాను. ఆయన తరిమాడు. నేనాయనకు దొరకలా. నేను రచయితగా ఎప్పటికయినా ప్రూవ్ చేసుకోవాలనే పట్టుదల నాలో అప్పుడే పుట్టింది.



భార్య విజయ భార్గవితో...

## వాడి జీవితం నాకెందుకు?

పూర్వం సమాజం అంటే ఒక వ్యక్తికి బహువచనం. అప్పుడు పరిధి తక్కువ. మన రాష్ట్ర జనాభా అంతా కూడా రెండుమూడు కోట్లే! అప్పుడు కథకులు కానీ, పాఠకులు కానీ ఇప్పట్లా ఉండేవారు కాదు, ఇప్పట్లా ఆలోచించే వారు కాదు. అప్పుడు చదువరి గాని, రచయిత గాని ఒక ఉద్దేశం పెట్టుకుని చదివేవారు, రాసేవారు. గట్టిగా చెప్పాలంటే గతంలో సమాజ శ్రేయస్సు ఆశించి రాసేవారు. ఆ కథలను ఆనాటి పాఠకులు తమ జీవితాలుగానే భావించి చదివే వారు. అందులోని పాత్రలను తమ స్వంత మనుషులుగా భావించేవారు. అయితే ఇప్పటి మనుషులు వాడి జీవితం నాకెందుకు ? అని చదవడం లేదు. గతంలో మనం సినిమాలు చూసి అందులోని వారి జీవితాలను చూసి ఏడ్చే వాళ్ళం. ఇప్పుడు సినిమా చూసి ఏడ్చేవాళ్ళు ఎందరున్నారు?

## ఆ రోజుల్లో కలాన్ని ఆయుధంగా చూశారు

ఇప్పుడు ఎవరిగోల వారిదే! ఎవరికీ ఏదీ పట్టడం లేదు. అయితే అప్పుడప్పుడూ గొప్పకథలు వస్తున్నాయి. 'ప్రయోగ ఫలాలు' గొప్ప కథ. అనుకూల పరిస్థితుల్లో వర్షం పడితే టమోటా రైతు ఎంతగా నష్టపోతాడు, ఎంతగా విలవిలలాడుతాడు అనేది ఆ కథ. ఇది సార్వజనీనమైన కథ. ఇలాంటివి తక్కువ వస్తున్నాయి. ఇప్పుడు చాలామంది కథకులు అసలు కథను మరిచిపోయి, శైలి మీద ఎక్కువ దృష్టి పెడుతున్నారు. కొత్తదనాన్ని ఆశిస్తూ గందరగోళంలో కొట్టుకుపోతున్నారు. డెబ్భయిల్లో వచ్చిన చాలామంది రచయితలపై ఈ ప్రభావం ఉంది. ఆ రోజుల్లో పెళ్ళి పీటల మీంచి అడవుల్లోకి పోయినవారున్నారు.. వారు తర్వాత ఏమయ్యారో తెలీదు. ఆరోజు కలాన్ని ఆయుధంగా చూశారు. ఇప్పుడు అలా కాదు. ఒకప్పుడు సొసైటీలో చాలా సమస్యలున్నా కూడా ఒక ధిక్కారం ఉండేది. రచయితలకూ పేరుండేది. ఆ ప్రభావం కళారూపాల మీద కనబడేది. ఇప్పుడు రోడ్డుమీద చూసినా, రోడ్డు కింద చూసినా ఎవడి హక్కుల కోసం వాడు పోరాడుతున్నాడే గాని, ప్రత్యేకించి సమాజానికి గుర్తింపు లేదు.



బాపుచేత సన్మానం అందుకుంటూ...

## యిప్పటి తరానికి పఠనాసక్తి ఉందా?

లేదు.. ప్రాథమికంగా భాషమీద గాని, చదువుపట్లగాని, ఉండాల్సినంత కోరిక లేకుండా చేసింది ఈ సమాజం. ఇంతకు ముందు బ్యాంకు క్లర్కు ఉద్యోగమో కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో అటెండర్ ఉద్యోగమో వచ్చినా చాలనుకునే వాళ్ళు. హాయిగా జీవించే వాళ్ళు. అందులో భాగంగా పుస్తకాలూ చదివే వాళ్ళు. ఇప్పటి ఉద్యోగాలు వేరు! ఇప్పటి చదువులు వేరు! గతంలో దేనికీ హద్దులుండేవి కావు. ఇప్పుడు అన్నిటికీ హద్దులే!

## ఈ సమాజానికి కథల అవసరం ఉందా?

చాలా ఉంది. కథంటే ఏంటి? జీవితం! తెలిసిన జీవితం కావచ్చు, తెలీని జీవితం కావచ్చు. ఇప్పటి జీవితాలు, సమాజము తెలియాలంటే కథలు చాలా అవసరం. ఈ సమాజం ఇలా కాకుండా ఎలా బాగుంటుందో తెలుసుకోవాలంటే కథలు చాలా అవసరం.

## 'హర్' అనే నవల 'గీత' లాంటిది!

నేను చదివిన మొదటి ఇంగ్లీషు నవల 'హర్'. దాని రచయిత ఎవరో తెలీదు. దాంట్లో కథ నాకు 'గీత'లాంటిది. ఫీలింగ్ గురించి చెప్పిన కథ అది. అప్పటినుంచి నా లైఫే మారిపోయింది. నాకు కవిత్వమంటే పడదు. కథలే ఎక్కువగా చదువుతాను. ఇక మా వీధి చివర ముసలమ్మ ఒకామె పుల్లట్లు వేసేది. అవంటే నాకు చాలా ఇష్టం. ఒక్కోరికి ఒక్కో వ్యక్తి అంటే ఇష్టం ఉంటుంది. నేను రెండో తరగతిలో ఉన్నప్పుడు మా క్లాసులో 'సుగుణ' అనే క్రిష్టియన్ అమ్మాయి ఉండేది. నల్లగా బొద్దుగా ఉండే ఆ అమ్మాయి టింగ్ టింగ్ అని నడిచేది. నాకెందుకో ఆ అమ్మాయంటే ఇప్పటికీ ఇష్టం. ఆ రూపం నా మైండ్‌లో అలా ఉండిపోయింది.

మీరు ఇంకో ప్రశ్న అడగలేదు. నాకు నచ్చిన చిత్రకారుడు బాపు. 63 ఏళ్ల అనుభవంతో చెప్తున్నాను. జపాన్, అమెరికా, క్యూబా, రష్యాలో చూశా.., ఆయనంతటి వ్యక్తి లేడు. ఆయనకున్న టాలెంట్‌కు ఎల్లలు లేవు. బాపు వచ్చి ఆంధ్రదేశానికి ఆర్ట్ అనే భిక్ష పెట్టాడు.


**-సుంకోజి దేవేంద్రాచారి**

నాకు నచ్చిన నా కథ

# బడ్జెట్ జీవితం

- చంద్ర

అవసరాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ, అవకాశాల మేరకు జీవితాన్ని మలుచుకోవడం నా అలవాటు.
ఇది ఈనాటిది కాదు. తెలిసీ తెలియని వయసు నుంచే అని జ్ఞాపకం! కాకపోతే ఉద్యోగంలో చేరినప్పట్నుంచే జీవితానికి కావల్సిన అవసరాలని రూపాయి పైసల్తో సర్దుకొస్తున్నాను.



చిన్నప్పట్నుంచీ తినీతినకా చాలీచాలక గడిచిన ఒంటరి జీవితం. అష్ట కష్టాలు పడి బి.ఏ. దాకా వారాలకు బ్రతుకులో నెగ్గుకొచ్చి నిరుద్యోగం విసిరిన వలలో విసుగెత్తి, తప్పించుకుని జీవితంలో రాజీపడడం కోసం చిల్లరబతుకు గడిపి, కొండరాళ్ళలోంచి దాటిన నది మైదానంలో ప్రశాంతంగా, నిలకడగా నడిచినట్టుగా ఇదిగో – ఈ నాలుగొందల గుమాస్తా జీవితానికి జతకలిపేసాను.

సర్దుకుపోవడం నా జీవితం!

ఈ దేశంలో ఎంత చదివినా, ఎంత మేధావి అయినా, ఏ నాయకుడు పోయి, ఏ ప్రభుత్వమొచ్చినా – ఏ భద్రతాలేని ప్రజల బ్రతుకే నాకు ఈ సర్దుకుపోవడం అనే అలవాటుని నేర్పింది.

అందుకే...

ఏ పనిచేసినా – ఓ పద్ధతి. ఓ లెక్క, ఓ ప్లాను ప్రకారం చెయ్యడం అలవాటు చేసుకున్నాను.

ఏదో ఓ గడ్డు క్షణాన ఎదురయ్యే ఇబ్బందికోసం – ఇల్లంటున్నపుడే బావితవ్వే రిస్కు తీసుకోవడం కన్నా ఈ ముందు చూపు నయం.

ప్రభుత్వం మారిపోయిందని చంకలు గుద్దుకుంటున్నారు. సంబరాలు చేసుకుంటున్నారు. ఎవరి నోట విన్నా ఒకేమాట. రామరాజ్యం వచ్చిందని!

నాకు నవ్వొచ్చింది!

అయిదేళ్ళకో, లేక వాళ్ళకి బుద్ధి పుట్టినప్పుడో ఎన్ని

కలు జరిపి, ప్రభుత్వం మారి పోయినంత మాత్రాన ఏం వొరుగుతోంది. తిండి గింజలు చవకయి పోయినాయా? కాలేజీలో సీట్లు సులభంగా దొరుకుతున్నాయా? డిగ్రీ తీసుకోగానే లేదనకుండా ఉద్యోగాలిస్తున్నారా? వ్యాపారులు లాభాలు తగ్గించుకుని అమ్మకాలు చేస్తున్నారా? పంచదార, కిరోసిన్ లాంటివి బ్లాకులో కాకుండా విరివిగా కంట్రోలు రేటుకే దొరుకుతున్నాయా?

మరెందుకీ హడావుడి?

నిజానికి ప్రభుత్వాలు ఎన్నిమారినా సామాన్యునికి ఒరిగేదేమీ లేదని క్రితం నెల నా బడ్జెట్ చూస్తే తెలుస్తుంది.

బస్సుఛార్జీలు పెంచడం వల్ల నాకు ఆ ఖర్చు పద్దెనిమిది నించి ఇరవై మూడు రూపాయలకి తేలింది. కిరోసిన్ లీటర్‌కి ఏభై పైసలు పెంచారు. అంటే ప్రతినెల పదిహేను అయ్యేది ఇప్పుడు అదనంగా రెండు రూపాయల ఏభై పైసలు పెరిగింది. ఉల్లిపాయల ధరలు పెరిగాయి.

వీటన్నింటివల్లా ఇప్పుడు నా ఆదాయంలో దాదాపు పదిహేను రూపాయల లోటు కనిపిస్తోంది.

అందుకే సాధ్యమయినంత వరకు ఖర్చులు తగ్గించాను.

రెండు కిలోల బియ్యం తగ్గించాను. రెండే బట్టల సబ్బులు వాడు తున్నాను. సరుకులన్నీ వంద, రెండు వందల గ్రాములు తగ్గించాను. పెరిగిన బస్సు ఛార్జీలు దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యానికి మంచిదన్న వంక పెట్టుకుని రెండు స్టేజీలు ముందే దిగి నడుస్తున్నాను. ఒక లీటర్ కిరోసిన్ తగ్గించేసి వంట తగ్గించేసాను, సిగరెట్లు తగ్గించాను.

ఇంకా నయం!

ఇంటి వాడు అద్దె పెంచలేదు!

ఇట్లాగ కడుపుకట్టుకుని, చిన్నచిన్న కోరికల్ని నిర్దాక్షిణ్యంగా చంపేసుకుంటున్నా – లోటు ఎప్పుడూ లోటే!

తలుపు చప్పుడయితే వెళ్ళి తీశా!

లలిత

***

లలిత వెళ్ళిపోవడానికి లేచింది. గది మూల కెళ్ళి కాళ్ళు కడుక్కుంది.

పగిలిపోయిన అద్దం ముక్కలో చూసుకుంటూ జుట్టు సర్దుకుంది. చీరంతా దులిపి, విప్పి, మళ్ళీ చక్కగా కట్టుకుంది. పవిటను, పెదాల మధ్య నొక్కి చేతుల్ని వెనక్కి కదిల్చి... బ్రాని సరిచేసుకుని జాకెట్ హుక్స్ పెట్టుకుంది.

నేలమీద పరచిన పక్కమీదే పడుకుని – అంతవరకు నా ఇరవై తొమ్మిది సంవత్సరాల మగబతుక్కి ఒక ఊరట, ఒక ఆనందం, ఒక తృప్తిని కలి గించిన ఆడతోడుని లలితని గమనిస్తూనే వున్నాను.



చాలీచాలని జీతం రాళ్ళతో, ధరలు పెరిగి రోజురోజుకీ జీవితం ఎంత ఇరుకయి పోయినా నేను ఎన్నికోరికల్ని చంపుకునయినా నా బడ్జెట్‌లో ప్రతి నెలా నలభై రూపాయలు తప్పకుండా లలిత కోసం, తను నా కోసం నెలకి రెండు సార్లు అందిస్తున్న ఆడ ఆనందం కోసం మిగులుస్తాను.

సెక్స్ అనే అవసరానికి నాలుగొందల ఇరుకు జీవితంలోకి ఇంకో మనిషిని పెళ్ళాడి తోడు తెచ్చుకుని బ్రతికే సాధ్యం కాని పరిస్థితిని నేను బాగా ఊహించగలను.

అందుకే...

లలితతో ఈ ఒప్పందం!

ఆమె నా కోసం నెలకి రెండు సార్లు నా గదికి వస్తుంది.

నేను ఆమెకి ప్రతిసారి ఇరవై ఇచ్చుకుంటాను.

లలిత మరోసారి వేళ్ళతో జుట్టుని సరిచేసుకుంది.

పవిటను చివరంటూ పట్టుకుని ఎత్తి భుజాల మీదుగా కప్పుకుంది.

అంటే–

మరో క్షణానికి లలిత తలుపులు తీసుకుని వెళ్ళిపోతుంది.

నేను పక్కమీంచి చటుక్కున లేచి గోడకు తగిలించిన చొక్కా అందు కున్నాను.

జేబులోంచి డబ్బు తీసి ఇరవై రూపాయలు తీసాను.

లలిత దగ్గరగా వచ్చింది.

డబ్బు అందిస్తూ "థాంక్స్" అన్నాను.

లలిత చిన్నగా నవ్వింది.

అందించిన డబ్బు తీసుకుంది.

చొక్కా మళ్ళీ గోడకి వేళ్ళాడేసాను.

వెనక్కి తిరిగితే లలిత ఇంకా అక్కడే నిలబడి ఉంది.

అది నా భావన.

ఇదిగో... ఇదీ నా బడ్జెట్....

జానా బెత్తెడున్న చీకటి కొట్టులాంటి యీ గదికి అద్దె నూటయిదు రూపాయలు (కరెంటు, నీళ్ళతో సహా) కిలో ఒక్కంటికి మూడుం పావలా చొప్పున పదిహేను కిలోల బియ్యం నలభై ఎనిమిది రూపాయల డెబ్బై అయిదు పైసలు, ఒక కిలో మంచి నూనె, వందగ్రాముల కొబ్బరినూనె కలిపి ఇరవై రూపాయల ఏభై పైసలు. రెండు వొంటి సబ్బులు, మూడు బట్టల సబ్బులకి కలిపి పదిహేనురూపాయలు... పప్పులూ ఉప్పులూ లాంటి కిరాణా సరుకులన్నింటికి కలిపి డెబ్బై రూపాయలు, ఆదివారాలు మినహాయించి ఆఫీసుకు వెళ్ళేందుకు బస్సు చార్జీలు పద్దెనిమిది రూపాయలు. నిరుద్యోగపు రోజుల్లో అలవాటయిన సిగరెట్లకి ఇరవై రెండు రూపాయల యాభయి పైసలు... నెలకి నీళ్ళ పాల ఖర్చు ఇరవై రెండు రూపాయల ఏభై పైసలు. వంటకి కావల్సిన కిరోసిన్ ఖర్చు (బ్లాకులో) పది హేను రూపాయలు. కూరగాయలకి ఇరవై రూపాయలు... లలితకి నెలకి నలభై రూపాయలు.

మొత్తం మూడు వందల తొంభై అయిదు రూపాయల ఇరవై అయిదు పైసలు!

కాని నాకు మా కంపెనీ వారు కటింగులు మినహాయించుకుని జీతంగా ఇస్తున్నది మూడు వందల తొంభై అయిదు రూపాయలు మాత్రం.

అంటే నా ఆదాయంలో పావలా లోటు!

ఇందుకు నేను ఎక్కువగా చింతించను!

ఎందుకంటే అప్పుడప్పుడు కంపెనీకి సెలవులు వస్తాయి. అట్లాంటప్పుడు ఆనాటి బస్సు చార్జీలు ఆదా! లేదా ఎవరో మిత్రుడు కలిపి తనే టికెట్ తీసుకుంటాడు. మరోసారి ఏ పరిచయస్తుడో టీ తాగిస్తాడు. ఇంకెవరో హోటల్లో టిఫిన్ పెట్టించి, సిగరెట్ ఆఫర్ చేస్తారు.

ఇటువంటి మిగుళ్ళు తాలూకు డబ్బు ఓ చిన్న డబ్బాలో పడేసి వుంచుతాను.

ఎప్పుడయినా తక్కువ పడినా, లేదా ఏ జ్వరమో, తలనొప్పో వస్తే డాక్టర్‌కి, మందులకు ఉపయోగిస్తుంది.

అదృష్టవశాత్తు ఏడాదికోసారి వచ్చే బోనసు బట్టలూ, చెప్పులూ లాంటి అవసరాలకి పనికొస్తుంది

అంతగా తప్పని అవసరం ఏదయినా వస్తే అది మాని ఇది, ఇది మాని, ఖర్చులు ఎడ్జెస్ట్ చేసుకుంటాను.

***

"మరీ..." అంది లలిత.

"ఏమిటి లలితా?" అడిగాను.



## కథాంతరంగం

ఒకరోజు హోటల్లో చాయ్ తాగుతున్నా..ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ పెడుతున్న రోజులు.. ఆయన పార్టీ పెట్టాలా వద్దా అనే విషయంపై హోటల్లో ఒక గుంపునుంచి రకరకాల వాదనలు..రకరకాల ఒపీనియన్స్ వస్తున్నాయి. అలా వాదులాడుకుంటున్న గుంపులో ఒక ముసలోడున్నాడు. ఆయన కాసేపయ్యాక "ఎందుకే ఊరకే కుక్కలా మొరుగుతారు.. నీయమ్మ.. పనికి పోకుండా ఉంటార్రా" అన్నాడు. ఎవరు పార్టీలు పెట్టినా, పెట్టకపోయినా అందరికీ కూడు, గుడ్డ అవసరం అనేది ఆయన మాటల్లో ధ్వనించింది. దాన్నే కథగా అక్షరీకరించాను.

– చంద్ర

ఫోన్: ***9391028856***

"ఏమీ లేదు!" కాస్సేపాగి–

"మీకూ తెలుసు. నాకు మరో సంపాదన లేదు. రోజులేమో మండిపోతున్నాయి. నా కుటుంబం పట్ల నాకు ఉన్న బాధ్యత మీకు తెలుసు" అంది.

నాకు ఆశ్చర్యంగా వుంది.

లలిత నాతో వున్న దాదాపు రెండు గంటల సమయంలో ఏమీ మాట్లాడదు. చాలా మౌనంగా – మా అవసరాలు విరిసిన వలల్లో కలుస్తాం తప్ప, నంగినంగి మాటలతో, తెచ్చి పెట్టుకున్న ఆనందంతో మేమెప్పుడూ మలినమవలేదు.

నాకు సెక్స్ అవసరం. తనకి డబ్బు అవసరం. అన్న నిజంలోనే కలుస్తాం. అంతకన్నా పరస్పరం ఒకర్నించి మరొకరం ఏమీ ఆశించం.

అలాంటిది ఇప్పుడు...

"చెప్పు లలితా!" అని అన్నాను.

"మరేమీ అనుకోవద్దు. ఇక నుంచి తడవకి ముప్ఫైయిస్తే నాకు కొంచెం సులువవుతుంది" అంది.

నేను ఏమీ మాట్లాడలేదు.

"ఏమిటీ మాట్లాడరేం? మీకు ఇబ్బంది అయితే... మీ పరిస్థితి నేను అర్థం చేసుకోగలను..." అంది. వెనక్కి తిరిగింది వెళ్ళిపోవడానికి.

"ఉండు లలితా!" అంటూ మళ్ళీ చొక్కాలోంచి మరో పదినోటు తీసి అందించాను.

క్షణం సేపు నాకేసి సూటిగా చూసింది.

నోటు అందుకుంది. అందుకుంటూ "సారీ" అంది.

"ఫర్లేదులే!" అన్నాను.

"వెళ్ళొస్తాను." అని తలుపు తీసింది.

బైట వీధిలో వెలుతురు లేదు. అంతా చీకటిగా వుంది.

ఈ నెల నుంచి లలితకు తడవకి ముప్ఫయి రూపాయిలు ఇవ్వాలి. ముప్ఫయి రూపాయిలు.

అందుకోసం నేను మళ్ళీ మిగతా ఖర్చులు అడ్జెస్ట్ చేసుకోవాలి!

"లలితా" అని గబుక్కున అన్నాను.

ఆగింది–

ఏమిటన్నట్టు గుమ్మంలో నుంచుంది.

"ఇక నుంచి నెలకి ఒకేసారి రా! ప్లీజ్.... నిన్ను రెండుసార్లు రమ్మనడానికి నా నెలసరి బడ్జెట్ పర్మిట్ చేయదేమో..." అన్నాను.

లలిత మొహంలో నాకేమీ కనిపించలేదు.

"సరే... వస్తానూ..." అంది.

*

*(యువ మాసపత్రిక)*

